జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 26-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 738 పేజీలు: 4 వెల : రూ.7






## ఎక్సైజ్ ప్రమోషన్ల వెనుక.. లక్షల బాగోతం?

- జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలోని ఓ కీలక అధికారిపై అవినీతి ఆరోపణలు
- ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి లక్షన్నర వసూలు చేసినట్లు ప్రచారం
- పారదర్శకతకు పాతరేస్తూ అక్రమ వసూళ్లు





శ్రీకాకుళం, జులై 25 (వార్త): రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుళ్ల పదోన్నతుల వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కి వచ్చినప్పటికీ, దీని వెనుక జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన ఎక్సైజ్ కానిస్టేబుళ్ల పదోన్నతుల్లో భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. జిల్లా ఎక్సైజ్ శాఖకు చెందిన ఓ కీలక ఉన్నతాధికారి నిబంధనలను పక్కనబెట్టి, ఒక్కో పోస్టుకు రూ. 1 లక్ష నుండి రూ. 1.50 లక్షల వరకు వసూళ్లకు పాల్పడినట్లు శాఖా పరంగా తీవ్ర చర్చ నడుస్తోంది.

### కోర్టు వివాదాల సాకుతో..

2018 నుంచి కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన ప్రమోషన్లను క్లియర్ చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 51 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు కల్పించే క్రమంలో పెద్ద ఎత్తున చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి డిమాండ్ చేసి మరీ వసూళ్లకు తెగబడ్డారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఒకవైపు సన్మానాలు.. మరోవైపు వసూళ్లు!

ఇటీవలే రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి జీఓ నెం.394 అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. మెరిట్, రోస్టర్ విధానం ప్రకారం పారదర్శకంగా భర్తీ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర నేతలు నోడల్ డిప్యూటీ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారికి విజ్ఞప్తి కూడా చేశారు. ప్రభుత్వం, అసోసియేషన్ ఇంత పారదర్శకత కోసం ప్రయత్నిస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం జిల్లాలోని ఓ ఉన్నతాధికారి ఈ ప్రమోషన్లను క్యాష్ చేసుకున్నారనే ఆరోపణలు విస్మయం కలిగిస్తున్నాయి. సుదీర్ఘ కాలం తర్వాత వచ్చిన ప్రమోషన్లను వదులుకోలేక, సదరు అధికారి అడిగినంత ఇచ్చుకోలేక కానిస్టేబుళ్లు తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం. ఈ భారీ వసూళ్ల భాగోతంపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



## పార్టీకి చెడ్డపేరు తెస్తే.. క్షమించేదే లే!

- కమీషన్ల కోసం ప్రభుత్వ ప్రతిష్టను తాకట్టు పెడుతున్నారా?
- పాతపట్నం నియోజకవర్గ రోడ్లపై కలమట ఫైర్

కొత్తూరు, జులై25 (వార్త): రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులను రాజమార్గాలుగా తీర్చిదిద్దుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తుంటే... పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల కొద్ది రోజుల కిందట నియోజకవర్గంలోని పలు మండలాలలో పర్యటించి కలమట రహదారులను చూసి ఆయన కొంత ఆశ్చర్యానికి గురయ్యారు. నియోజకవర్గంలో కొత్తూరు మండలంలోని సిరుసువాడ - కుంటిభద్ర, బంకి- రాయల, లబ్బ - గొట్టిపల్లి, అదేవిధంగా ఎల్ఎన్‌పేట మండలంలోని మంజూరైన రహదారులు, పాతపట్నంలోని కొన్ని రహదారుల పనులు ప్రారంభించి మధ్యలోనే గాలికి వదిలేసిన రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన... “మరమ్మత్తులు ప్రారంభించిన తర్వాత కంటే ప్రారంభించక ముందు ఉన్న రోడ్లే మెరుగ్గా ఉండేవి” అంటూ రహదారులు, సంబంధిత అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పనులు పూర్తికాకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లించారని ప్రశ్నించిన కలమట, ప్రజాధనాన్ని ఎవరి ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తుంటే, కొందరు అధికారులు కమీషన్ల కక్కుర్తితో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకుండానే ఎం-బుక్‌లలో నమోదు చేసి బిల్లులు విడుదల చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. ‘ప్రజలకు ఉపయోగపడాల్సిన రోడ్లు నాసిరకంగా మారితే బాధ్యత ఎవరిది, పనులు సగం కూడా పూర్తి కాకముందే బిల్లులు విడుదల చేసే ధైర్యం అధికారులకు ఎక్కడి నుంచి వస్తోంది, ఈ వ్యవహారంలో ఎవరి అండ ఉంది అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే అధికారులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే వారిని, పార్టీకి చెడ్డపేరు తీసుకొచ్చే నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలమట వెంకటరమణమూర్తి హెచ్చరించారు. ‘ప్రభుత్వ ప్రతిష్టతో చెలగాటం ఆడితే ఎంత పెద్ద అధికారి అయినా... ఎంతటి నాయకుడైనా వదిలే ప్రసక్తే లేదు. ప్రజాధనానికి ప్రతి రూపాయి లెక్క చెప్పాల్సిందే. అవసరమైతే ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ కోరుతాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదు” అని ఆయన స్పష్టం చేశారు. అలాగే కొందరు నేను రోడ్డు మీదకు వస్తే కొందరి గుండెల్లో ఈ రోడ్డుపై వస్తున్న దుమ్ము వలె వారి గుండెల్లో దుమ్ము రేగుతుందని అందుకే కొన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో తప్పుడు పోస్టులు పెడుతున్నారని, ఇలా ఎవరు ఎన్ని పెట్టిన పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తున్న వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలు పాతపట్నం నియోజకవర్గ రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. రోడ్ల పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం స్పందిస్తుందా? సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటుందా? అనే అంశాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.







## వివేకానంద విగ్రహం ధ్వంసం

- బారువ బాయ్స్ హైస్కూల్లో ఘటన

సోంపేట, జులై 25 (వార్త): బారువాలో గల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. అలాగే చుట్టుపక్కల ఉన్న పూల మొక్కలను కూడా పీకి పడేశారు. ఈ ఘటనపై శనివారం ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు గ్రామానికి చెందిన యువకులు పరిశీలించి ఆశ్చర్యానికి గురయ్యారు. గతంలోనూ బారువలో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దేవాలయంలో నంది విగ్రహం మరో దేవాలయం వద్ద హుండీ చోరీ జరిగిన సంఘటనలు బారువ ప్రజలు మర్చిపోకముందే కొద్ది నెలల్లోనే విగ్రహ ధ్వంసం జరగడం పట్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజేష్ ఖన్నా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు పట్ల కూడా పోలీసులు ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయలేదని అన్నారు. తాజా సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పాఠశాల హెచ్‌ఎంను కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఇది చట్టం కాదు.. రెడ్‌బుక్ రాజ్యాంగం

-మాజీ మంత్రి సీదిరి కుటుంబంపై రాజకీయ కక్ష

- రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోవడం బాధాకరం

- విచారణ పేరుతో వాస్తవాల వక్రీకరణ

- ప్రతిపక్షాలను అణచివేతకు కుట్ర

- రోడ్డు ప్రమాదాలను కూడా వాడుకోవడం చరిత్రహీనం

- టీడీపీకి ఓ న్యాయం..

వైకాపాకు మరో న్యాయమా

- కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు

-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మందస, జూలై 25(వార్త):** ఇది చట్టం కాదు.. రెడ్ బుక్ రాజ్యాంగమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. మందస పట్టణంలోని వారు ప్రత్యేకంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడిన వివరాలిలా ఉన్నాయి. ఇది చట్టం కాదు... రెడ్‌బుక్ సెక్షన్లతో సీదిరి కుటుంబంపై రాజకీయ వేట. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రమాదానికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం విచారణ జరపాలి. కానీ విచారణ పేరుతో వాస్తవాలను వక్రీకరించడం, రాజకీయ కక్షతో తీవ్రమైన సెక్షన్లు పెట్టడం, సంబంధం లేని కుటుంబ సభ్యులను అరెస్టు చేయడం న్యాయం కాదు. ఒక రోడ్డు ప్రమాదాన్ని చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ఆయుధంగా మార్చుకుంది. ప్రమాదంపై నిష్పక్షపాత దర్యాప్తు చేయకుండా, వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కేసును నడిపిస్తోంది. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడే ప్రమాదం చేశాడనే విషయం ఇంకా నిరూపణ కాకముందే , రోడ్డు ప్రమాదం, నిర్లక్ష్యానికి సంబంధించిన సెక్షన్లతో కాకుండా ఏకంగా కల్పబుల్ హోమిసైడ్ అభియోగం మోపడం వెనుక ప్రభుత్వ రాజకీయ ఉద్దేశం లేదా? రోడ్డు ప్రమాదం జరిగినంత మాత్రాన ప్రతి కేసూ కల్పబుల్ హోమిసైడ్ కాదు. ప్రమాదానికి కారణమైన వ్యక్తికి తన చర్య వల్ల మరణం సంభవించే అవకాశం ఉందన్న స్పష్టమైన అవగాహన లేదా జ్ఞానం ఉందని ప్రాసిక్యూషన్ ఆధారాలతో నిరూపించాలి. ఉద్దేశం, జ్ఞానం లేని ప్రమాదాల్లో నిర్లక్ష్యానికి సంబంధించిన నేరానికి, కల్పబుల్ హోమిసైడ్‌కు మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రతి కేసు వాస్తవాల ఆధారంగానే నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ కేసులో అలాంటి ఉద్దేశం ఉందని నిరూపించే ప్రాథమిక ఆధారం ఏమిటి? వాస్తవాలను బయటపెట్టకుండా ముందుగానే హత్యానేరం తరహా ముద్ర వేయడం దర్యాప్తా? లేక రాజకీయ తీర్పా? కుమారుడిపై కేసు పెట్టి, అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపిన తర్వాత ఇప్పుడు తండ్రి సీదిరి అప్పలరాజును కూడా అరెస్టు చేయడం చూస్తే---ప్రమాదంపై విచారణ కంటే కుటుంబాన్ని రాజకీయంగా వేధించడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఒక ఆరోపణ వచ్చినంత మాత్రాన అది నిజమైపోదు. పోలీసుల అభియోగం న్యాయస్థానం తీర్పు కాదు. దర్యాప్తు పూర్తికాకముందే మీడియా ట్రయల్ నిర్వహించి రాజకీయ నాయకుడిని దోషిగా చిత్రీకరించడం చట్టబద్ధ పాలన కాదు. చంద్రబాబు మనసులోని రాజకీయ అజెండాను ఓ పత్రిక కథనంగా రాయడం, ఆ కథనాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌గా మార్చడం---ఇదేనా రాష్ట్రంలో అమలవుతున్న కొత్త న్యాయవ్యవస్థ? సీదిరి అప్పలరాజు కుటుంబం విషయంలో పోలీసులు భారతీయ న్యాయ సంహితను అనుసరిస్తున్నారా? లేక చంద్రబాబుగారి రెడ్‌బుక్ సెక్షన్లను అమలు చేస్తున్నారా? వైఎస్సార్‌సీపీ నాయకుల విషయంలో ముందుగా అరెస్టు, తర్వాత ఆధారాల వెతుకులాట జరుగుతోంది. అధికారపార్టీ నాయకుల విషయంలో మాత్రం ముందుగా రక్షణ, తర్వాత కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇదే ప్రమాణాన్ని టీడీపీ నాయకులు, మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాలన్నింటికీ వర్తింపజేస్తారా? టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యుడు వాహనం నడిపి ప్రమాదం చేస్తే ఆ నాయకుడిని కూడా అరెస్టు చేస్తారా? లేక కల్పబుల్ హోమిసైడ్ సెక్షన్లు వైయస్సార్‌సీపీ కుటుంబాలకు మాత్రమే రిజర్వు చేశారా? ఇది ప్రజాస్వామ్యం కాదు..పోలీసు రాజ్యం. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చట్టం అందరికీ సమానంగా అమలవడం లేదు. పార్టీ రంగు చూసి సెక్షన్లు, రాజకీయ అనుబంధం చూసి అరెస్టులు జరుగుతున్నాయి. ప్రతిపక్ష నాయకులను అణచివేయడానికి రోడ్డు ప్రమాదాలను కూడా ఉపయోగించుకునే స్థాయికి చంద్రబాబు కక్ష రాజకీయాలు దిగజారాయి. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నాయకులను ఒక్కొక్కరిని కేసుల్లో ఇరికించి మౌనం చేయాలన్నదే ఈ అరెస్టుల వెనుక అసలు కుట్ర. సీదిరి అప్పలరాజు సామాన్య మత్స్యకార కుటుంబం నుంచి తన ప్రతిభతో ఎదిగిన వ్యక్తి. జనరల్ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేసి వైద్యుడిగా సేవలందించారు. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎంతోమందికి వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడిన వైద్యుడిని, ప్రజాసేవలో కొనసాగుతున్న నాయకుడిని తప్పుడు అభియోగాలతో నేరస్థుడిగా చిత్రీకరించాలని చూడటం అత్యంత దుర్మార్గం. సీదిరి అప్పలరాజు చేసిన అసలు తప్పేమిటి? వైయస్సార్‌సీపీలో ఉండటమా? చంద్రబాబు ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించడమా? పలాస ప్రజల తరఫున నిలబడటమా? రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనే ధైర్యం లేక పోలీసులను పంపించి అరెస్టు చేయించడం చంద్రబాబు బలానికి కాదు---రాజకీయ బలహీనతకు నిదర్శనం.. పోలీసులు చట్టానికి జవాబుదారీగా ఉండాలి తప్ప చంద్రబాబు, లోకేష్‌ల రాజకీయ ఆదేశాలకు కాదు. యూనిఫాం వేసుకున్న అధికారులు రెడ్‌బుక్ కార్యకర్తలుగా వ్యవహరిస్తే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం ఎలా ఉంటుంది? అరెస్టుల ద్వారా గొంతులు నొక్కవచ్చని చంద్రబాబు భావిస్తే అది భ్రమ. ప్రతి అక్రమ కేసు, ప్రతి రాజకీయ అరెస్టు, ప్రతి అధికార దుర్వినియోగానికి ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుంది. ఈ కేసులో ప్రభుత్వం తక్షణమే పారదర్శకత పాటించాలి. సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్టు చేసి వైయస్సార్‌సీపీని భయపెట్టలేరు. ప్రజల కోసం పోరాడే ప్రతి నాయకుడికి పార్టీ పూర్తి అండగా నిలుస్తుంది. చంద్రబాబుగారూ... అధికారం శాశ్వతం కాదు. పోలీసులు ఎప్పటికీ మీ రాజకీయ సైన్యంగా ఉండరు. మీరు ఇవాళ పెట్టిస్తున్న ప్రతి తప్పుడు కేసు, చేయిస్తున్న ప్రతి అక్రమ అరెస్టు రేపు మీ పాలనకు వ్యతిరేకంగా సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రమాదంపై దర్యాప్తు చేయండి... రాజకీయ ప్రత్యర్థి కుటుంబంపై వేట ఆపండి. చట్టంలోని సెక్షన్లు వర్తింపజేయండి... చంద్రబాబు రెడ్‌బుక్ సెక్షన్లు కాదు. టీడీపీ వారికి ఒక న్యాయం... వైయస్సార్‌సీపీ వారికి మరో న్యాయమా? ఎఫ్ఐఆర్ కాదు... చంద్రబాబు ఆదేశం చట్టం కాదు. రోడ్డు ప్రమాదాన్ని రాజకీయ హత్యాయుధంగా మార్చిన రెడ్‌బుక్ ప్రభుత్వం. అరెస్టులతో ప్రశ్నలను ఆపలేరు... అక్రమ కేసులతో నిజాన్ని దాచలేరు కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మందస మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, జిల్లా పార్టీ కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అందాల శేషగిరి, సొర్ర ఢిల్లీరావు, పీతాంబరం, గిన్ని తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్, సిందిరి జగన్, హరికృష్ణ, బత్తిని లక్ష్మణ్, బత్తిని వెంకట్, గొరకల కేశవరావు, మాజీ సర్పంచ్ లు గేదెల పద్మనాభం, గున్న రమణ, గోపాల్, మార్పు కృష్ణ, ఎమ్పీటీసీ కంచిబెహర, బురద జగదీష్, గుంపు జగదీష్, శోభన్, గొలుసు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు

- కొంక్యాన ట్రస్టు అన్నప్రసాద వితరణ



**శ్రీకాకుళం, జూలై 25(వార్త):** శ్రీకాకుళంలోని తుమ్మావీధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు తిరుమల మురళీకృష్ణ, తిరుమల శరత్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, రాధాకృష్ణ, వేణుగోపాల్, కోట సావిత్రమ్మ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## తుప్పలతో తిప్పలు

- వాహన చోదకులకు అవస్థలు

- మలుపులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు

-కొన్నాళ్లుగా జంగిల్ క్లియరెన్స్ చేయక ఈ దుస్థితి



**జి.సిగడాం, జూలై 25(వార్త):** జి.సిగడాం నుంచి పొగిరి గ్రామానికి వెళ్లే రహదారి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తిప్పలతో వాహన చోదుకులు నిత్యం తిప్పలు పడుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు, చెట్ల కొమ్మలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్య కారణంగానే ఇటీవల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడం, మలుపుపై స్పష్టత లేక బోల్తా కొట్టడడం వంటి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. శనివారం ఆ రహదారి మార్గంలో ఆర్టీసీ బస్సు ప్రయాణం ఇస్తున్న త్వరణంలో ఒ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టబోయింది.అదృష్టవశాత్తు ఎవరికి ఎం కాలేదు ఎక్కడ వాహనాలు అక్కడే అగిపోయి దీనితో ప్రయాణికులు ఉపిరి పీల్చుకున్నారు. సంబదిత అదికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ప్రయానికలు వాహన చోదుకులు వాపోతున్నారు. ముఖ్యంగా అదికారులు మండల కేంద్రానికి వెళ్లడానికి చాలా నరకయా తన పడుతున్నారు. కొంతమంది అదికారులు ప్రమాదాలకు గురైయ్యారు. దీని పై సంబందిత అదికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



**జి.సిగడాం, జూలై 25(వార్త):** పెంట గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ, జల జీవన్ మిషన్ తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని శనివారం రణస్థలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)నకు కూటమి నాయకులు మక్క నారాయణరావు వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ, త్రాగు నీటి సదుపాయం కోసం నిధులను మంజూరు చేయాలని సమస్కలను పరిష్కరించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ నాయకులు డోల పార్వతీ, మీసాల రమణ ఉన్నారు.

## సీజన్ వ్యాధులపై అప్రమత్తం

**జి.సిగడాం, జూలై 25(వార్త):** వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం పిహెచ్ సీ డాక్టర్ బి.యశ్వంత్ అన్నారు. శనివారం అయెన విలేఖర్లు తో మాట్లాడుతూ నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలుతా యన్నారు సీజనల్ వ్యాధుల నియంత్రణకు మండలంలో 31 గ్రామ పంచాయితీల ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయితీ శాఖల సమన్వయంతో కార్యాచరణ పని చేయాలని తెలిపారు.తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో నీటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు.ప్రతీ శుక్రవారం డ్రై డేను పాటిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా అతిసార, టైఫాయిడ్, పచ్చ కామెర్లు వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



## పలాసను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

**పలాస, జూలై 25(వార్త):** పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. పలాసనియోజకవర్గం కాశీబుగ్గ--పలాస మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం ఫైనాన్స్ నిధుల ద్వారా రూ.15 లక్షల వ్యయంతో 255 మీటర్ల పొడవున కాలనీ నుండి బరేల్ గ్రౌండ్ వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పెసరపాడు గ్రామంలో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ప్రజల శీఅవసరాలకు అనుగుణంగా శీఅభివృద్ధి



కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేష్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్, మున్సిపాలిటీ ఇతర ముఖ్య నాయకులు, పలాస మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## నేడు కార్గిల్ విజయ దినోత్సవం




**పలాస, జూలై 25(వార్త):** కార్గిల్ ప్రాంతం భారతదేశం సైన్యం సొంతం చేసుకోవడంలో దేశ సైన్యం కీలక పాత్ర పోషించిందని పలాస జూనియర్ డివిజన్, సివిల్ జడ్జి యు మాధురి పేర్కొన్నారు జూలై 26 కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా గౌరవ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలపై అధ్యక్షులు, పలాస మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ డివిజన్, సివిల్ జడ్జ్ సూచనలపై శనివారం కాశీబుగ్గ శ్రీ బాల శివయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశ సైన్యము కార్గిల్ ప్రాంతమును కైవసం చేసుకుని భారతదేశ ప్రతిష్ట కాపాడిన గొప్ప విజయ దినోత్సవం అని, ఎంతోమంది భారత సైనికులు సైనిక అధికారులు తమ ప్రాణాలను త్యాగం చేసి, ఈ కార్గిల్ యుద్ధంలో అమరవీరులయ్యారని అటువంటి అమరవీరుల త్యాగానికి ధన్యవాదాలు అని చెప్పారు. విద్యార్థి దశలో ఎన్సిసి అనగా నేషనల్ క్యాడేట్ సర్టిఫికెట్ అనేది చాలా ముఖ్యమైన విభాగమని, తద్వారా సమాజ సేవకు, దేశ సేవకు విద్యార్థులు కూడా ఒక గొప్ప సేవా అవకాశాన్ని పొందుతారని తెలియజేశారు. మొబైల్ ఫోన్ల ద్వారా ఎంతటి విజ్ఞానం లభిస్తుందో అంతే చెడు ప్రభావాలు కూడా ఉన్నాయని, బాలబాలికలు లేదా విద్యార్థినీ విద్యార్థులు అటువంటి చెడు అంశాలను దూరంగా ఉంచి, చరవాణిని వారి విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి విద్యా సంబంధితమైన అంశాలను పొందడానికి సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కళాశాలలకు తమ పిల్లల్ని పంపించినప్పుడు విద్యార్థులు వారి దృష్టిని చదువు మీద పెట్టి ఉన్నత శిఖరాలు పొందాలని, దేశ సేవకు ప్రతి ఒక్కరూ కూడా అంకితం కావాలని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ వి. రాజు ఎన్సిసి అధ్యాపక అధికారి ఎన్సిసి విద్యార్థినీ విద్యార్థుల ద్వారా కవాతులను నిర్వహించి అమరవీరులకు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బి. కామేశ్వరరావు పట్నాయక్, పానల్ న్యాయవాది, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది డాక్టర్ కే. లోకేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి,ఎన్సిసి ఇన్చార్జి లెక్చరర్ రాజు, ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్సిసి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

**జలుమూరు, జూలై 25 (వార్త):** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీస్తుందని టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం. గిరిధర్, భీమారావు హెచ్చరించారు. శనివారం జలుమూరు మండలం చల్లవానిపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన శక్తి యాప్ అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. మహిళలు, బాలల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసుల సహాయాన్ని వేగంగా పొందవచ్చని వివరించారు. అలాగే మహిళలు, బాలల హక్కులు, వారికి రక్షణ కల్పించే చట్టాలు, సైబర్ నేరాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించడంతో పాటు సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంతారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## గిరిజనులకు అన్యాయం చేయొద్దు



**మందస, జూలై 25(వార్త):** భూమిని నమ్ముకుని బతుకున్న గిరిజనులకు అన్యాయం చేయవద్దని గిరిజన శక్తి సంక్షేమ సంఘం మందస మండల నాయకులు కోరారు. మందస మండలంలోని కొండలోగాం పంచాయతీలో చాపరాయి గ్రామం పరిధిలో 94సర్వే నెంబర్ గల సుమారు 34ఎకరాల గిరిజన భూములను గత నాలుగు రోజులుగా మందసతో పాటు మరో ఆఫీస్ నుండి సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. రైతులుకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేస్తున్నారన్నారు. హటాత్తుగా ఈ సర్వే ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలు, పరిశ్రమలు కట్టడానికైతే తాము భూములను ఇచ్చేదిలేదన్నారు. ఇప్పటివరకు భూమిని నమ్మి బతుకుతున్న గిరిజన పేద రైతు కూలీలకు ఐక్యంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్థానిక గిరిజనులతో మాట్లాడిన తహసీల్దార్ ఎటువంటి సర్వే చేయమని చెప్పారని, గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిని భవిష్యత్తులో పునరావాతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకొంటారని గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు సవర నరసింహరావు, కార్యర్శి సవర హరికృష్ణ, మానవహక్కుల వేదిక జిల్లాకార్యదర్శి ఎస్.నారాయణరావు ఏపీ రైతు కూలీసంఘం రాష్ట్ర కోశాధికారి కోనేరు రమేష్, బాలకృష్ణ, తులసిరావు నందేశ్వరరావు, పాపారావు, గోవిందరావు, విశ్వనాథం, కళావతి, నాగేశ్వరరావు, హేమలత తదితరులు కోరారు.

## నర్తు వెంకటరమణ కుటుంబానికి ఆర్థికసాయం



**మందస, జూలై 25(వార్త):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నర్తు వెంకటరమణ లొహరిబంద హైస్కూల్ విద్యార్థుల ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన వెంకటరమణ మరణంతో ఆయన కుటుంబం దిక్కులేనిదిగా మారింది. దీంతో పలువురు సాయమందిస్తున్నారు. వెంకటరమణ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు తెలుసుకొని లొహరిబందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2007-2008 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు రూ.11.500 రూపాయలు ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి అందజేశారు. చిన్న వయసులో ఇలాంటి ప్రమాదంలో వెంకటరమణ మరణించడం చాలా బాధాకరమని, మన గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబానికి మన వంతు సహాయం చెయ్యాలని ఈ పూర్వ విద్యారులు ఏకమై ఈ ఆర్థిక సహాయం చేశామని వారు తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి అందుబాటులో ఉన్న పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి కలిసి ఆర్థిక సహాయం అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎం.పాపారావు(టీచర్), ఎం.కేశవ్, ఎం.పాపారావు, పి.జానకిరావు, టి.జానకిరావులతో పాటు గొరకల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడికి ఆర్మీ ఉద్యోగి హేమరాజు ఉదారత

**మందస, జూలై 25(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీ తెలగగంగువాడ గ్రామానికి చెందిన లైసెట్టి హేమరాజు ఇండియన్ ఆర్మీలో పని చేస్తున్నారు. ఆయన అక్షరాలు దిద్దిన పాఠశాలకు బడి రుణం తీర్చుకుందాం అనే ఉద్దేశంతో వంటశాల మరమ్మతులకు 5000 రూపాయలు విరాళంగా అందించారు. మెగా పీటీఎం 4.0 కార్యక్రమంలో లైసెట్టి హేమరాజు తన తల్లిదండ్రులు మోహనరావు, ఊర్మిళ పేరున చాలా సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. అందులో భాగంగా పాఠశాలకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హేమరాజుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.ఉపేంద్ర, ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు చిత్త గున్నయ్య, చిత్త కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో పరాకాష్టకు చేరిన కూటమి కక్ష సాధింపులు

**-వైకాపా నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజం**

**-ప్రమాదాన్ని హత్యగా మలచడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ**

**- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి కుటుంబానికి వైఎస్సార్సీపీ నేతల పూర్తి మద్దతు**

**పలాస, జులై 25(వార్త):** అధికార బలంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ, ప్రత్యర్థులపై రాజకీయ కక్షసాధింపులకు దిగడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైకాపా నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని జి.ఎం. ఈకాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైకాపా ముఖ్య నేతలు పాల్గొని మాట్లాడారు. ఇటీవల పలాసలో జరిగిన ఒక దురదృష్టకర రోడ్డు ప్రమాదాన్ని రాజకీయ కుట్రతో హత్య కేసుగా చిత్రీకరించి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆయన కుమారుడు ఆరవ్ వర్మలపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికార యంత్రాంగం, పోలీసుల ద్వంద్వ వైఖరిపై వారు నిప్పులు చెరిగారు. ఇటీవల పలాసలో చోటుచేసుకున్న ఒక అత్యంత దురదృష్టకరమైన రోడ్డు ప్రమాదాన్ని కేవలం రాజకీయ ప్రతీకారంతో హత్య కేసుగా చిత్రీకరించి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆయన చిన్న కుమారుడు ఆరవ్ వర్మ, సిద్ధార్థ అనే యువకుడిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు.

### ప్రమాదాన్ని హత్యగా మార్చే కుట్ర

పలాసకు చెందిన దుబ్బ దానయ్య రోడ్డు ప్రమాదంలో మరణించడం అత్యంత విచారకరమైన సంఘ టన అని, ఆ కుటుంబానికి జరిగిన తీరని లోటు పట్ల తమకు పూర్తి సానుభూతి ఉందని పేర్కొన్నారు. ఒక రోడ్డు ప్రమాదం జరిగితే చట్టబద్ధంగా దాన్ని ప్రమాద కేసుగా నమోదు చేసి విచారణ జరపాల్సింది పోయి, పోలీసు యంత్రాంగం అధికార పార్టీ నాయకుల రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి హత్య కేసుగా మార్చడం ప్రజాస్వామ్యానికి మచ్చ. ఇది కచ్చితంగా కుట్రపూరిత చర్యే!' అని నాయకులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే మానవతా దృక్పథంతో ఊస్పందించి, బాధితుని కుటుం బానికి అండగా నిలిచేందుకు సిద్ధార్థ త్యాడి ముందు కొచ్చారని వారు గుర్తుచేశారు. పెద్దల సమక్షంలో జరిగిన చర్చల ద్వారా రూ. 8.50 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడమే కాకుండా, ఇప్పటికే రూ.1 లక్షకు పైగా ఆర్థిక సహాయం కూడా అందించారని తెలిపారు. అయినప్పటికీ, ఈ సంఘటనతో ఎటువంటి సంబంధం లేని డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీయాలనే దుర్బుద్ధితోనే ఆక్సిడెంట్ కేసును హత్య కేసుగా మలిచారని ఆరోపించారు. ద్వంద్వ వైఖరిపై నిలదీత-ప్రజాస్వామ్యానికి ముప్పు! రాష్ట్రంలో ప్రతిరోజూ ఎన్నో చోట్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటన్నింటినీ హత్య కేసులుగా నమోదు చేస్తున్నారా? అని



వైఎస్సార్సీపీ నాయకులు ప్రశ్నించారు. ఒకే రకమైన సంఘటనలకు వేర్వేరు ప్రమాణాలు అమలు చేయడం వెనుక ఉన్న రహస్య మేమిటని నిలదీశారు. ఇటీవల మందస మండలంలో జరిగిన ప్రమాద ఘటనలో ఎందుకు హత్య కేసు నమోదు చేయలేదని, అధికారంలో ఉన్నవారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాన్ని వక్రీకరిస్తే, అది సమాజానికి ప్రమాదకరమైన టసంప్రదాయంగా టమారు తుందని హెచ్చరించారు. డాక్టర్ సీదిరి అప్పలరాజు ఒక వైద్యుడిగా వేలాదిమందికి ఉచిత సేవలందించి ప్రజల గుండెల్లో నిలిచారని నాయకులు గుర్తుచేశారు. ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా పలాస రూపురేఖలను మార్చి వేశారని కొనియాడారు. వైఎస్సార్ ల్యాండ్ మార్క్ ఆసుపత్రి నిర్మాణం, కిడ్నీ బాధితుల కోసం శాశ్వత మంచి నీటి పథకాలు, పట్టణాల సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను. ప్రజా సమస్యలను మాజీ మంత్రి బలంగా ప్రశ్నిస్తున్నారనే భయంతోనే ఆయనను రాజకీయంగా వేధించేందుకు ఈ కుట్ర పన్నుతున్నారని స్పష్టం చేశారు. ముందుగా ఆయన కుమారుడు ఆరవ్ వర్మను రిమాండ్కు పంపి, ఆ తర్వాత అప్పలరాజును కూడా నిందితుడిగా చేర్చి అరెస్టు శీచేయడం ప్రభుత్వ దిగ జారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఇలాంటి అక్రమ కేసులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భయపడేది లేదని, ఈ రాజకీయ కక్షసాధింపు చర్యలను సమాజం అసహ్యించుకుంటోందని నాయకులు స్పష్టం చేశారు. చట్టాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడం వెంటనే మానుకోవాలని, ప్రమాదాలను మానవతా కోణంలో చూడాలే తప్ప రాజకీయ రంగు పులమవద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు పైల చిట్టి, ఉంగ సాయికృష్ణ, మచ్చ ధనరాజు, బత్తిన హేమేశ్వరరావు, చింతాడ మాధవరావు, కోర్ల మురళికృష్ణ, కోర్ల శివకృష్ణ, కంచరాన భాస్కరరావు తదితరులున్నారు.

## మందస గురుకులంలో నాణ్యమైన ఉత్తమ విద్య

**- ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి**

**- గురుకులం ప్రిన్సిపల్ లఖినాన లక్ష్మి**



**మందస, జులై 25(వార్త):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో నాణ్యమైన, ఉత్తమ విద్య అందుతోందని ప్రిన్సిపల్ లఖినాన లక్ష్మి అన్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఆమె విలేకరులతో మాట్లాడి, గురుకులంలోని ఖాళీల వివరాలను తెలిపారు. ప్రభుత్వ విద్యాభివృద్ధికి రూ.కోట్లు వ్యయం చేస్తోందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ లక్ష్మి తెలిపిన ఖాళీ సీట్ల వివరాలిలా ఉన్నాయి.

| తరగతి | ఎస్.సి. | ఓసీ | బీసీ |
|---|---|---|---|
| ఐదవ తరగతి | 50 | 01 | -- |
| ఆరవ తరగతి | 12 | 01 | -- |
| ఏడవ తరగతి | 28 | 00 | -- |
| ఎనిమిదవ తరగతి | 23 | 01 | -- |
| తొమ్మిదవ తరగతి | 27 | 00 | -- |
| 10వ తరగతి | 42 | 00 | -- |
| ఇంటర్(ఎంపీసీ)ప్రథమ | 08 | 01 | -- |
| ఇంటర్(బైపీసీ)ప్రథమ | 01 | 01 | -- |
| ఇంటర్(ఎంపీసీ)ద్వితీయ | 25 | 00 | -- |
| ఇంటర్(బైపీసీ)ద్వితీయ | 03 | 00 | 01 |

గురుకులంలో మిగిలిన ఈ సీట్లకు అర్హులైన విద్యార్థినిల నుంచి దరఖాస్తులు కోరబడుతున్నాయని ప్రిన్సిపల్ లక్ష్మి తెలిపారు. ఎంపికకాబడిన విద్యార్థినిలకు స్పాట్ అడ్మిషన్లు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా అడ్మిషన్ పొందవచ్చనన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భక్తులకు పులకింపజేసిన వాసుదేవుని దివ్యరూపం

**-భక్తి,శ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు**

**మందస, జులై 25(వార్త):** జైశ్రీమన్నారాయణ.. వాసుదేవా.. అంటూ మందస పట్టణంలోని శ్రీవాసుదేవుని ఆలయంలో భక్తుల నామస్మరణతో మార్మోగింది. తొలి ఏకాదశి కావడంతో భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. వేకువజామునుంచే ఆలయంలో వాసుదేవునికి అభిషేకాలు, దివ్యాలంకరణ కావించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వాసుదేవుని ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామి దివ్యరూపునిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసుని ప్రతిరూపంగా భక్తులు శ్రీవాసుదేవుని భావించి, కనులారా దర్శించుకుని, తన్మయత్వం చెందారు. అనంతరం అర్చకులు భక్తులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.



## విద్యార్థుల నైపుణ్యాలను ప్రోత్సహించాలి

**- ప్రాథమిక స్థాయి నుంచే ప్రతిభ వికాసానికి కృషి చేయాలి**

**- కంబకాయ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ శాంతారావు**

**నరసన్నపేట, జులై 25 (వార్త):** ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీయవచ్చని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం కంబకాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, సృజనాత్మకత, వివిధ రంగాల్లో ఉన్న ఆసక్తులను పరిశీలించి వారికి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ఉన్న ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారికి ఏ అంశంపై ఎక్కువ ఆసక్తి ఉందో తెలుసుకుని ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా మార్గనిర్దేశం చేస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలల్లో సానుకూల అభ్యాస వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న బోధన, అభ్యాస కార్యక్రమాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే విద్యా వ్యవస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



## గోతులమయమైన శివరాంపురం రహదారి

**- రాళ్లు తేలి దెబ్బతిన్న రోడ్డుతో ప్రయాణికుల అవస్థలు**

**- తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి**



**సారవకోట, జులై 25(వార్త):** సారవకోట మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని శివరాంపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై రాళ్లు తేలిపోవడంతో పాటు పెద్దఎత్తున గోతులు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, పలువురు గాయపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. వర్షం పడితే గోతులు నీటితో నిండిపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. రోడ్డు దుస్థితి కారణంగా గ్రామానికి ఆటోలు సైతం రావడానికి నిరాకరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రహదారిని ప్రయాణానికి అనువుగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. శాశ్వత పరిష్కారంగా రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి గ్రామ ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి ఉద్యమం.. చారిత్రాత్మక విజయం

**-విద్యార్థి-యువజన ఉద్యమంతో డిమాండ్లను అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం !**

**- హర్షం వ్రక్తం చేసిన జిల్లా ఐసా, అర్వైయ్యే నాయకులు**

**పలాస, జులై 25 (వార్త):** దేశవ్యాప్తంగా జంతర్ మంతర్తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగిన విద్యార్థి--యువజన ఉద్యమం చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని ఐసా, అర్వైయ్యే నాయకులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యమం ముందుంచిన ప్రధాన డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చిందని, ఉద్యమం ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను పదవి నుంచి తొలగించడంతో పాటు, ప్రభుత్వం క్రింది కీలక నిర్ణయాలను కూడా ప్రకటించిందని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవడం, అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయడం. ఉద్యమ సమయంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడం వంటివి విజయాలుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐస అఖిల భారత అధ్యక్షురాలు కామ్రేడ్ నేహా మాట్లాడుతూ ఈ అద్భుత విజయాన్ని సాధించిన దేశ యువతకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. "మన పోరాటం ఒక మంత్రి రాజీనామాతో ముగిసేది కాదని, విద్యను ప్రజాస్వామ్యీకరించడం కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. జాతీయ పరీక్షల సంస్థ ( ఎన్ టి ఎ)ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యను ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ దిశగా నడిపిస్తున్న జాతీయ విద్యా విధానం ( ఎన్ ఇపి)ను ఉపసంహరించుకోవాలని, దేశానికి సమాన అవకాశాలు, అందరికీ అందుబాటులో ఉండే, సామాజిక న్యాయ సూత్రాలపై ఆధారపడిన ప్రజాస్వామ్య విద్యా వ్యవస్థ అవసరం" అని పేర్కొన్నారు. ఈ ఉద్యమం భారతదేశ ప్రజాస్వామ్య పోరాటాల చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఈ విజయం విద్యార్థులది, యువతది, ప్రజలదని శ్రీకాకుళం ఐసా, అర్వైయ్యే ప్రతినిదులు కైలాస్, నారాయణ, జగదీష్ లు హర్షం వ్యక్తం చేశారు.



## కనీస వేతనాలు సవరించాలి



**పలాస, జులై 25 (వార్త):** షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ రంగంలో కనీస వేతనాలు సవరించాలని, జూలై 30 న జరిగే కలక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని జీడి కార్మికులకు పిలుపునిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పలాసలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె కేశవరావు, జిల్లా కమిటీ సభ్యులు యన్ మోహనరావులు మాట్లాడుతూ గత 19 ఏళ్ళు నుండి జీడి పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాల జిఓలు సవరించబడలేదని అన్నారు. పియఫ్, ఇ యస్ ఐ గ్రాడ్యూటీ, బోనస్, వెల్ఫేర్ వంటి కనీస సంక్షేమ చట్టాలు ఉన్నప్పటికీ జీడి కార్మికులకు అందకుండా పోయాయని అన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా అంధవల సిన ఆర్థిక సహాయం అందక జీడి కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటంలో జీడి కార్మికులంతా కదలాలని పిలుపునిచ్చారు. జూలై 30 కలక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీకి తరలిన బీసీ నాయకులు



**ఇచ్ఛాపురం, జులై 25 (వార్త):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమంలో పాల్గొనేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ల జైదేవ్, సాలిన ఢిల్లీ యాదవ్ ఇచ్ఛాపురం నుంచి ఢిల్లీకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఇచ్ఛాపురంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను విడుదల చేసి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ జైదేవ్, పత్రి తవిటయ్య, కొర్రాయి వాసుదేవరావు, నందిగామ కోటి, రెయ్య జానీ, కొర్రాయి ధర్మ, జన్నెల సంతోష్, సాలిన జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సాలిన ఢిల్లీ యాదవ్ తో కలిసి కాళ్ల జైదేవ్ పాల్గొని బీసీ హక్కులు, రిజర్వేషన్ల అమలు, సామాజిక న్యాయం తదితర అంశాలపై జరిగే సమావేశాలకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.



## రత్తకన్న పాఠశాల పూర్వ విద్యార్థుల సేవా నిరతి

**ఇచ్ఛాపురం, జులై 25 (వార్త):** రత్తకన్న పురపాలక ఉన్నత పాఠశాలలో 2003-04 లో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం గతంలో నిర్వహించిన సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని అదే రోజు బ్యాచ్ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ నిర్ణయంలో భాగంగా తొలి ఏకాదశి సందర్భంగా తొలి సేవా కార్యక్రమంగా సీతయ్య ఫౌండేషన్ కి 5 వేలు రూపాయలువిరాళంగా అందజేశారు. ఈ విరాళం ద్వారా అక్కడి ఆశ్రయితలకు ఒక రోజు (అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం) భోజన వసతి ఏర్పాటు చేశారు.

## అప్పలరాజు అరెస్టుపై మత్స్యకారుల నిరసన

**సోంపేట, జులై 25 (వార్త):** మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు అక్రమమని సోంపేట మండలానికి చెందిన పలు మత్స్యకార గ్రామాల్లో శనివారం నిరసనలు తెలిపారు. మత్స్యకారుల పిలుపుమేరకు వైసిపి సమన్వయకర్త సాడిశ్యాం ప్రసాద్ రెడ్డి, వైసీపీ నేత తడక జోగారావు ఆయా గ్రామాలకు హాజరయ్యారు. మత్స్యకారుల నిరసనలకు సంఘీభావం తెలిపారు. ఎర్రముక్కాం, ఉప్పలం, బారువా కొత్తూరు, ఇసకల పాలెం గ్రామాల్లో మత్స్యకారులు సీదిరి అరెస్టును తీవ్రంగా ఖండించారు. అప్పలరాజు కుమారుడు రోడ్డు ప్రమాదాన్ని కూడా కూటమిపాలకులు హత్యగా చిత్రీకరించి బాలుడు పై కూడా కక్ష తీర్చుకోవడం కూటమినేతల అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అప్పలరాజు కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమంగా అన్యాయమైన సెక్షన్లు వేసి పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసుకుని రాజకీయ కక్షలు తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని అంతేతప్ప అక్రమంగా, అన్యాయంగా నేతల కుటుంబాలను జైల్లో బంధించడం కూటమినేతల దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల వైసిపి నేతలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రైతన్న కష్టం తీరేదెప్పుడు?

## - తీర్చేది దేవుడా... నాయకుడా...?

(ఆమదాలవలస)

ఆమదాలవలస నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో రైతన్నలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఒకవైపు వర్షాలు కురవక పొలాలు ఎండిపోతుండగా, మరోవైపు ఎరువుల కొరత రైతులకు మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది. వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్న రైతన్నకు పరిస్థితులు రోజు రోజుకూ భారంగా మారుతున్నాయి. పంటను ఎలాగైనా కాపాడుకోవాలని బోర్లు, మోటార్లతో నీరు అందించాలని ప్రయత్నించినా డీజిల్, పెట్రోల్ ధరలు భారీగా ఉండటంతో సాగు వ్యయం అమాంతం పెరిగింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎరువులు సకాలంలో అందుబాటులో లేకపోవడం, ప్రకృతి సహకరించకపోవడం, పెరుగుతున్న సాగు ఖర్చులు రైతుల నడ్డివిరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రైతన్న కష్టం తీరేది ఎప్పుడు? తీర్చేది దేవుడా... నాయకుడా...?" అంటూ పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు తక్షణమే అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని, సాగు వ్యయాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వ్యవసాయమే దేశానికి వెన్నెముక అని చెప్పే ప్రభుత్వాలు, రైతన్న కష్టాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.







## వేతనదారులకు పండ్ల మొక్కల పంపిణీ



**నరసన్నపేట, జులై 25 (వార్త):** వీబీజీ- రామ్జీ పథకం కింద ఉపాధి హామీ వేతనదారులకు పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నరసన్నపేట మండల ఏపీవో యుగంధర్ తెలిపారు. శనివారం మండల కేంద్రానికి తొలి విడతగా పండ్ల మొక్కలు చేరుకున్నాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి విడతలో మొత్తం 484 పండ్ల మొక్కలు అందాయని తెలిపారు. వీటిలో జీడి, మామిడి, సపోటా మొక్కలు ఉండగా, మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ వేతనదారులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి వేతనదారులకు అదనపు ఆదాయం కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. పంపిణీ చేసిన మొక్కలను సంరక్షించి పెంచాలని, వాటి ద్వారా భవిష్యత్తులో ఆర్థిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. రెండో విడతలో మరిన్ని మొక్కలు వచ్చే అవకాశం ఉందని, అవి అందిన వెంటనే అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఏపీవో యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు బాలసుబ్రమణ్యం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి



**పలాస, జులై 25 (వార్త):** కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31 న జిల్లా కలక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు అంగన్వాడీలు పాల్గొంటారని ఐసిడి యస్ పి ఓ కె పార్వతికి అంగన్వాడీలు శనివారం నోటిసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి, నాయకులు కె కేశవరావు, యన్ మోహనరావు అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు బి సునీతలు మాట్లాడుతూ కనీస వేతనాలు ఇస్తామని, ఇచ్చిన వాగ్దానం వంటనే అమలు చేయాలని కోరారు. గతంలో రాసుకున్న మినిట్ అమలు చేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ పని వత్తిడి పెంచి కక్ష సాధింపు చర్యలు చేస్తుందని విమర్శించారు. జూలై 31 ధర్నా ద్వారా ప్రభుత్వం కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ భవాని, జె శైలజ, డి విజయలక్ష్మి, నారాయణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



**సోంపేట, జులై 25 (వార్త):** విద్యార్థుల ఆరోగ్యానికి అందరం ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కొర్లాం పి హెచ్ సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మణిమాల పేర్కొన్నారు. మారుమూల గ్రామమైన ఎంజీపురం లో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పేరెంట్స్ డే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. విద్యార్థి దశలో చక్కనైన ఆరోగ్యానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది తగువిధంగా కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో ఉదయం నుంచి రాత్రి వరకు అందిస్తున్న భోజనం విషయంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అప్పుడే పౌష్టికాహారం తీసుకున్న విద్యార్థులకు పోషకాలు సక్రమంగా అందుతాయని అన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటు శారీరిక ఎదుగుదల కూడా బాగుంటుందని అన్నారు. దీని ద్వారా విద్యార్థుల చదువులు కూడా బాగుంటాయని సూచించారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని అన్నారు.

## లక్కీ షాపింగ్ మాల్ సేల్స్‌మ్యాన్

## నరేంద్ర కుటుంబానికి రూ.20,000ల సాయం

### -అనారోగ్యంతో ఉన్న నరేంద్ర భార్యకు

### లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం అండ

### - మానవతా దృక్పథంతో స్పందన

**పలాస, జులై 25(వార్త):** లక్కీ షాపింగ్ మాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సేల్స్‌మ్యాన్ నరేంద్ర కుటుంబానికి సంబంధించిన అత్యవసర వైద్య అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, మేనేజ్‌మెంట్, సిబ్బంది సమిష్టిగా రూ.20,000 ఆర్థిక సహాయం శనివారం షాపింగ్ మాల్ లో అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్లు స్వామి యాదవ్, శంకర్ బాబు,శ్రీహరి యాదవ్ ముందుండి సహాయ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కుటుంబానికి తక్షణ ఉపశమనం కలిగించేలా అందరూ మానవతా దృక్పథంతో స్పందించడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. కష్టకాలంలో తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవడం సంస్థ కుటుంబ భావనను కలుగుతుందని వెల్లడించారు. ఇలాంటి సేవా భావం ఇతరులకు కూడా స్ఫూర్తినిస్తుందని యాజమాన్యం తెలిపింది. లక్కీ షాపింగ్ మాల్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి సంక్షేమమే తమకు ముఖ్యమని, భవిష్యత్తులోనూ అవసరమైన సందర్భాల్లో ఇలాంటి సహాయ సహకారాలు కొనసాగుతాయని మేనేజ్‌మెంట్ స్పష్టం చేసింది.



## గ్రామీణాభివృద్ధికి సంస్థల సామాజిక బాధ్యత నిధులు విస్తరించాలి

### -ఎమ్మెల్యే కూన రవికుమార్




**ఆమదాలవలస, జులై 25 (వార్త):** హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద సంస్థల సామాజిక బాధ్యత సదస్సులో ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రజా సంస్థల కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహారుద్దిన్, తెలంగాణ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలు నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విస్తరించాలని అన్నారు. విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో గ్రామాలకు సంస్థల సహకారం మరింతగా అందేలా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధిలో సంస్థల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రభుత్వంతో పాటు స్వచ్ఛందంగా సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమాలు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థి సంఘాల పోరాటం ఫలితమే కేంద్రంలో చలనం

### - నీట్‌లో విద్యార్థులకు జరిగిన అన్యాయంపై పోరాటం కొనసాగిస్తాం

### - కేంద్రమంత్రి రాజీనామా సంఘటిత విజయమని ఏఐవైఎఫ్ వ్యాఖ్య



**నరసన్నపేట, జులై 25 (వార్త):** విద్యార్థి సంఘాల ఐక్య పోరాటం కారణంగానే కేంద్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన రాజీనామా సంఘటిత ఉద్యమ విజయానికి నిదర్శనమని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నరసన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యం తగదని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు జరిగిన అన్యాయంపై తమ పోరాటం కొనసాగుతుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం పెంపొందేలా పారదర్శక విధానాలను అమలు చేయాలని సూచించారు.

## మెట్టూరు శివాలయం కూల్చివేతకు

# జనసేనకు సంబంధం ఏంటి?

**కొత్తూరు, జులై 25(వార్త):** కొత్తూరు మండలం మెట్టూరు బిట్--1లో శివాలయం తొలగింపు ఘటనకు జనసేన నాయకులు కొరికాన భవాని, రవికుమార్,ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని సంబంధం కల్పిస్తూ జరుగుతున్న ప్రచారాన్ని కొత్తూరు మండల జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. కొత్తూరు మండల జనసేన నాయకులు శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఒక గ్రామంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో శివాలయం తొలగింపు జరిగిన విషయానికి ఎలాంటి సంబంధం లేని జనసేన నాయకుల పేర్లను లాగడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని విమర్శించారు. 2023 సంవత్సరంలోనే ఇరిగేషన్, రెవెన్యూ, కెనాల్ శాఖలకు ఆ నిర్మాణం అక్రమమంటూ ఫిర్యాదులు అందాయని,అనంతరం 2025లో గౌరవ హైకోర్టు ఆ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో గ్రామానికి చెందిన బుర్లె శ్రీనివాస రావు ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేయగా, 2026లో హైకోర్టు మరోసారి రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఆ కోర్టు ఆదేశాల మేరకే సంబంధిత అధికారులు శివాలయాన్ని తొలగించారని స్పష్టం చేశారు.ఈ విషయాన్ని కొందరు నాయకులు మా జనసేన నాయకురాలు కొరికాన భవాని, రవికుమార్ లను విమర్శించడం సరికాదని హెచ్చరించారు.

అన్ని దేవాలయాలకు విరాళాలు అందించిన జనసేన నాయకులపై నిరాధార ఆరోపణలు చేయడం, వారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నమని మండల జనసేన నాయకులు పేర్కొన్నారు. తాము కూటమి ప్రభుత్వానికి, కూటమి సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవింద రావు, సంబంధిత అధికారులు ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో కొత్తూరు మండల జనసేన అధ్యక్షుడు దొంపాక జయరాజు, అధపక అశోక్, లోతుగెడ్డ తిరుపతిరావు, లోతుగెడ్డ జనార్దనరావు, కొత్తూరు శ్రీరాములు, మిన్నారావు, చోడవరపు సింహాచలం, అనిల్ కుమార్, కన్నయ్య స్వామి, కే. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## రాజకీయ కుట్రలో "సీదిరి" అప్పలరాజును ఇరికించారు

### - ప్రతీకార రాజకీయాలు మానాలి

### - యువకుడి భవిష్యత్తును నాశనం చేసేలా కేసులు వేయడం తగదు

### - సీదిరి కుటుంబానికి అండగా ఉంటాం

### - పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**పలాస, జులై 25 (వార్త):** అధికార పార్టీ పన్నిన పన్నాగంలో రాజకీయంగా ఎదుర్కోలేక, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును రాజకీయ కుట్ర కోణంలో ఇరికించారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం పలాసలోని జీఎంఐ ఆవరణలో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నివాసానికి వెళ్లిన రెడ్డి శాంతి, అప్పలరాజు సతీమణి శ్రీదేవి, పెద్ద కుమారుడు, తల్లిని కలిసి పరామర్శించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ తరఫున అన్ని విధాలుగా ధైర్యం ఇస్తామని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం ప్రగతిభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన రెడ్డి శాంతి, ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దానయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనతో ఆ కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాన్ని ఆధారంగా చేసుకుని దాన్ని హత్య కేసుగా మలచడం దారుణమని ఆమె మండిపడ్డారు. పోలీసులూ, కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తూ, ఒక యువకుడి భవిష్యత్తును నాశనం చేసేలా కక్షపూరితంగా కేసులు పెట్టడం సమంజసం కాదని ప్రశ్నించారు. ప్రమాదాన్ని ప్రమాదంగానే చూడాలని, దానికి రాజకీయ రంగు పూసి హత్యగా చిత్రీకరించడం సరికాదని ఆమె హితవు పలికారు. ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలకాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు.

## బాలికోన్నత పాఠశాలలో సమస్యలు తిష్ట!

### - వైసీపీ నేత శ్యాం ప్రసాద్ రెడ్డి



**సోంపేట, జులై 25 (వార్త):** సోంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని వైసిపి ఇచ్ఛాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వైసీపీ నేత తడక జోగారావు తో కలిసి శనివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఏడాదికాలంగా ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని విద్యార్థులు ప్రతిరోజు వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిచెన్ రూమ్ సదుపాయాలు బాగోలేవని అన్నారు. వంటలు చేయడానికి గ్యాస్ సిలిండర్లు కూడా లేవని పేర్కొన్నారు. సరిపడా వంట పాత్రలు లేవని ఆహార నిల్వ పాత్రలు కూడా లేవని పేర్కొన్నారు. నాడు నేడు బిల్డింగ్ పనులు సెకండ్ ఫ్లోర్ ఇంకా పూర్తి చేయలేదని అన్నారు. ఈ సమస్యలపై త్వరలో జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సురేష్ కూడా పాల్గొన్నారు.

## జనసేన ఫ్లెక్సీల చింపివేతపై విచారణ చేసిన పోలీసులు

**ఎల్ఎన్ పేట, జులై 25 (వార్త):** ఎల్ఎన్ పేట మండలం, స్కాట్ పేట జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన జనసేన ఫ్లెక్సీలు ఇటీవల కొంత మంది చింపివేయడంపై పార్టీ నాయకులు, పోలీసులు గత కొద్ది రోజులుగా విచారణ చేయగా మోదుగువలస, స్కాట్ పేట గ్రామాలకు చెందిన కొంత మంది యువకులు గ్రామ సమీపంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసుకున్నారని వాటి కోసం ఈ ఫ్లెక్సీ కు సంబంధించిన ఇనుప రాడ్డులను వారు ఉపయోగించుకున్నట్లు ఆ యువకులు పోలీసుల సమక్షంలో తెలియజేశారు. దీనిపై నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవాని స్పందిస్తూ ఇకనుంచి ఇలాంటి సంఘటనలు జరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక నుంచి ఇలాంటి సంఘటనలు జరిగినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులతో పాటు ఏఎంసీ సభ్యులు పిరియా నగేష్, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546